తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా


సోమాజిగూడలో హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి

హైదరాబాద్ | 26-02-2026 పేజీలు 8 /aksharagalam.com సంపుటి : 14 సంచిక : 2 వెల : 3/-

# పసిబిడ్డను చంపినా.. పట్టదా?

- దాడి చేసినవారిని సర్కార్ జైల్లో పెట్టదా?
- హంతకుడిని కాపాడే ప్రయత్నం సిగ్గుచేటు
- పాప మీ పదవి అడిగిందా? పైసలడిగిందా?
- కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆపం
- కోటి పరిహారం.. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- ఆ కుటుంబానికి ఇల్లు కట్టిస్తం.. కేటీఆర్ హామీ
- నాగర్‌కర్నూల్‌లో బాధితులకు పరామర్శ

*కుమ్మెరలో పసిగుడ్డు మృతి ఘటన మాటలకు అందని మహా విషాదమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'ఆ పసిగుడ్డు ఏం అడిగింది. మీరు ఎక్కిన గద్దె అడిగిందా? మీరు మూటగట్టుకున్న ముల్లెలు అడిగిందా? తెలంగాణ సభ్య సమాజం తలదించుకునే ఘటన ఇది' అంటూ కన్నెర్రజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కుమ్మెర బాధితులకు అండగా బుధవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ధర్నాలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ తల్లి.. దేవుడి దర్శనం అడిగిన పాపానికి.. జరిగిన ఈ దాడి మానవత్వానికే మచ్చ అని ఆవేదన వ్యక్తంచేశారు.*





**మహబూబ్‌నగర్:** తెలంగాణ సమాజమే తలదించుకునే దుర్మార్గ ఘటన కుమ్మెరలో జరిగిందని వాపోయారు. 'దర్శనానికి పోతా అంటే కులం పేరుతో దూషించడమే కాకుండా గణేశ్‌పై 25 మంది దాడిచేసి తన్నినచోట తన్నకుండా తన్ని ఆ తమ్ముడిని ఇబ్బందులు పెడితే.. అన్నా ఈ పసిగుడ్డు ముఖం చూసి అయినా విడిచి పెట్టండి అన్నా.. మావోడు ఒక్కడే ఉన్నాడు.. మీరు 20 మంది ఉన్నరు.. అని మౌనిక తన పసి బిడ్డను కాళ్ల ముందల పెట్టి వదిలిపెట్టండని ప్రాధేయపడిందని.. అయినా దుర్మార్గుడు, మానవ మృగంలాంటి మనిషి.. వాడెవడో చెత్త నా కొడుకు కాలితో తంతే ఆ శిశువు చనిపోయింది' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇలాంటి మానవ మృగాలను శిక్షించాల్సిన పోలీసులు ఏం చేస్తున్నరని నేను అడుగుతున్నా.. 'మా బిడ్డ మీద దాడి జరిగింది.. మా మీద దాడి జరిగింది' అని గణేశ్, మౌనిక ఫిర్యాదు ఇవ్వడానికి పోలీస్‌స్టేషన్‌కు పోతే.. 'లేదు లేదు.. మీరు సరిగా రాయలేదు' అని అన్నాడట ఓ పోలీస్ ఆయన.. నేను అడుగుతున్నా ఆ పోలీస్ అధికారిని. ఈ ఉద్యోగం ఇచ్చింది తెలంగాణ

మిగతా 2లో

# కాంగ్రెస్ సిగ్గుపడాలి

- ఎమర్జెన్సీ తరహాలో బాధపడాల్సి వస్తుంది
- ఏఐ సమిట్‌లో అర్ధనగ్న నిరసనలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

*కృత్రిమ మేధ (ఏఐ) సమిట్‌లో యువజన కాంగ్రెస్ అర్ధనగ్న నిరసనలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పని చేసినందుకు ఆ పార్టీ సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించినందుకు ఆ పార్టీ విచారించిన రీతిలోనే ఏఐ సమిట్‌వద్ద నిరసన నిర్వహించినందుకూ బాధపడాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు.*



**ఢిల్లీ:** ఢిల్లీలోని భారత్ మండపంలో రెండు రోజులపాటు నిర్వహించిన బిజినెస్ స్టాండర్డ్ మంథన్ సదస్సులో చివరి రోజైన బుధవారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ చర్యలపై విపక్షం ప్రశ్నించవచ్చని.. కానీ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించడం భారతీయులకు తలవంపులు తెచ్చే ప్రయత్నమేనని విమర్శించారు. ఈ చర్యవల్ల దేశ ప్రజల పరువేం పోలేదని, కాంగ్రెస్ పరువే పోయిందని 90 శాతం మంది ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు.

**రాజకీయ కోణంలో రాష్ట్రాల నిర్ణయాలు**

రాష్ట్రాల స్థాయిలో రాజకీయపరమైన అంశాల కారణంగానే బడ్జెట్‌లో కేటాయింపులు ఖర్చు కావడం లేదని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మూలధన పెట్టుబడి కోసం కేంద్రం ఇస్తున్న ప్రత్యేక సాయాన్ని స్వీకరించే విషయంలో రాజకీయ కోణంలో రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని తెలిపారు. సంప్రదాయ పెట్టుబడుల ఉపసంహరణ విధానాలను మించి ప్రభుత్వ సంస్కరణలు ఉంటున్నాయని వెల్లడించారు. చైనా విధానాలను భారత్ అనుసరించలేదని, రెండూ భిన్న ఆర్థిక వ్యవస్థలని అభిప్రాయపడ్డారు. 'అగ్రి స్టాక్' సంస్కరణలు విప్లవాత్మకమైనవి చెప్పారు. ఇవి యూపీఐ తరహా విప్లవాన్ని తెస్తాయని తెలిపారు. శిలాజేతర ఇంధన రంగంలో భారత్ పురోగతి సాధిస్తోందని సదస్సులో పాల్గొన్న కేంద్ర పునరుత్పాదక ఇంధన వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈ రంగంలో 2030 నాటికి 500 గిగావాట్ల ఉత్పాదకతను సాధించాల్సి ఉందని తెలిపారు.

- 'ఏఐ ఫర్ ఇండియా– ఫ్రం యాంబిషన్ టూ ఎగ్జిక్యూషన్'పై చర్చలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా పాల్గొన్నారు.
- హైటెక్ తయారీ రంగంలో

మిగతా 2లో

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

- పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి
- కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
- బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష

*పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు.*

**హైదరాబాద్:** ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశు సంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశం చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశు సంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక,

మిగతా 2లో



# రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

- బాన్సువాడలో శృతిమించిన ఎంఐఎం ఆగడాలు
- కామారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై డిజిపికి బిజెపి ఫిర్యాదు

*తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు.*

2

## రాష్ట్రానికి రూ.2,160 కోట్ల
# 'ఇందిరమ్మ' నిధులు!

- 3 లక్షల పీఎంఏవై గ్రామీణ యూనిట్ల మంజూరుకు చాన్స్
- మార్చి రెండో వారంలోగా స్పష్టత
- కేంద్ర నిధులు వస్తే ఖజానాకు పెద్ద ఊరట



**హైదరాబాద్:** ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవటంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం అందించే నిధుల్లో క్రమంగా స్పష్టత వస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం (పీఎంఏవై) కింద రాష్ట్రానికి ఈ నిధులు అందించాల్సి ఉంది. ఇప్పటికే ఆ పథకం కింద పట్టణ ప్రాంత ఇళ్లను కేంద్రం మంజూరు చేసిన విషయం తెలిసిందే. 1.3 లక్షల యూనిట్లు మంజూరు కావటంతో, దానికి సంబంధించి రూ. 1,695 కోట్లు అందనున్నాయి. ఇక ప్రధానంగా ఆశ పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యూనిట్లపై స్పష్టత రావాల్సి ఉంది. 3 లక్షల యూనిట్లు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచింది. ఆ మేరకు 3 లక్షల యూనిట్లు మంజూరయ్యే అవకాశం కనిపిస్తుండగా, అదే జరిగితే మరో రూ. 2,160 కోట్లు

మిగతా 2లో



# పునాదీ నాదే.. పూర్తిచేసేదీ నేనే

- వెలిగొండకు జులై నాటికి శ్రీశైలం నీళ్లు తెస్తాం
- సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ.436 కోట్లతో వెలిగొండ ఫీడర్ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం
- ఐదేళ్లలో వైకాపా ఖర్చు పెట్టింది రూ.500 కోట్లే
- ప్రాజెక్టు కట్టకుండానే జాతికి అంకితమంటూ జగన్ దొంగనాటకాలని ధ్వజం

2

# తెలుగు రాష్ట్రాల్లో తొలి హైటెక్ హైవే

- త్వరలో అందుబాటులోకి ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి
- రెండు రాష్ట్రాలను కలిపే మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
- 162 కి.మీ. పొడవు.. 9 చోట్ల మాత్రమే ప్రవేశం, నిష్క్రమణ

*తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలో అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాలుగు వరుసలుగా ఇది రూపొందుతోంది.*

2



# పసిబిడ్డను చంపినా.. పట్టదా?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం. నీకు జీతం ఇచ్చేది ఈ రాష్ట్ర ప్రజలే. రేవంత్‌రెడ్డో.. ఆయన తొత్తులో కాదు. నువ్వు సేవ చేయాల్సింది బాధితులకు.. ఎవరి మీద్దైతే దాడి జరిగిందో వాళ్లొచ్చి నీకు ఫిర్యాదు చేస్తే కైంప్లెంట్ సరిగ్గా లేదని అంటావా? సుమోటోగా తీసుకోవాలి. తప్పు జరిగితే నీ అంతట నీవు సుమోటోగా కేసు తీసుకోవాలి.

వాళ్లు షికాయత్ చేసే అవసరం కూడా ఇవ్వద్దు. కానీ నువ్వేం చేసినవ్? బాధితులు వచ్చి నీకు ఫిర్యాదు చేస్తే సిగ్గు లేకుండా అధికార పార్టీ నాయకులకు ఫోన్ చేస్తావా? అయ్యా నీ మీద కైంప్లెంట్ వచ్చింది. మీరు వచ్చి కౌంటర్ కైంప్లెంట్ ఇవ్వండి అని చెప్పి నువ్వే వాళ్లను ప్రేరేపించి వేసుకున్న యూనిఫామ్‌కు విలువ లేకుండా.. చేస్తున్న ఉద్యోగానికి విలువ లేకుండా.. పోలీసు అనే గౌరవాన్ని కోల్పోయే విధంగా నువ్వు వాళ్లను కాపాడే ప్రయత్నం చేస్తున్నవ్' అని నిప్పులు చెరిగారు. 'ఇవాళ పసిపాప చనిపోతే పెట్టాల్సింది హత్య కేసు కాదా? ఆ 8 మంది ఎవరైతే ఉన్నారో వాళ్లను జైల్లో పెట్టొద్దా? సిగ్గుందా? ఈ నాగర్‌కర్నూల్ పోలీస్ యంత్రాంగానికి అని నేను అడుగుతున్నా? ఇవాళ రోడ్డెక్కి ఆ బిడ్డ చనిపోయి ఇంకా మూడ్రోజులు కూడా కాలే.. ఆ తల్లి ఇవాళ బిడ్డకు పాలియ్యాల్సిన టైంలో కన్నీళ్లతో ఇక్కడ రోడ్డెక్కి అంబేద్కర్ సాక్షిగా చౌరస్తాలో కూర్చుంటే.. ఇక్కడి స్థానిక యంత్రాంగం ఆ బిడ్డతో పాటు రాజ్యాంగాన్ని ఖననం చేసింద్రు' అని ధ్వజమెత్తారు. 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్ర హం సాక్షిగా ఆ తల్లి ఏం అడుగుతుంది? న్యాయమే కదా?' అని నిలదీశారు. 'నేను అడిగిన చంద్రకళను.. అమ్మా.. మీ కుటుంబానికి మేము అండగా ఉంటాం.. ఇల్లు కట్టిస్తాం అంటే ఆమె ఏమన్నదో తెలుసా? అది తర్వాత సంగతి అన్నా.. ముందు వాళ్లకు శిక్ష పడేటట్టు చేయిండ్రి.. మీరు అసెంబ్లీలో మాట్లాడుండ్రి.. రాష్ట్రం దృష్టికి తీసుకుపోండ్రి.. బిడ్డను కోల్పోయిన ఆ తల్లికి.. తండ్రికి న్యాయం చేయింద్రని వేడుకున్నది' అని తెలిపారు. 'ఇంతకుమించి ఏం అడగాలి వాళ్లు?



ఏం తప్పు చేసింది ఆ పిల్ల? రెండు నెలల పసి గుడ్డుకు కులం తెలుసా? మతం తెలుసా? అధికారం తెలుసా? ఏం తెలుసు? మనిషి పుట్టాక పుట్టేది కులం.. మనిషి పుట్టాక పుట్టేది మతం.. ఇవాళ దానికోసం మనుషులను చిన్నచూపు చూసి.. దేవుడి దర్శనానికి రాకుండా చేసి, వారి మీద దాడి చేసి.. మళ్లీ వారి మీదనే కేసులు పెట్టి చివరికి రోడ్డుమీద కూర్చునే పరిస్థితి తెచ్చింద్రు. ఆ తల్లిదండ్రులు, ఆ కుటుంబాన్ని రోడ్డుమీదికి తెచ్చిన వ్యవస్థను చూసి ఈ తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. ఇవాళ రాజకీయం మాట్లాడటానికో.. రాజకీయం చేయడానికో నేనిక్కడికి రాలేదు' అని భావోద్వేగానికి లోనయ్యారు.

**ఎమ్మెల్యే, ఎంపీని అడుగుతున్నా..**

'స్థానిక ఎమ్మెల్యే, ఎంపీని అడుగుతున్నా.. ఎవరు చేసినా.. ఏ పార్టీ చేసినా.. హంతకుడు హంతకుడే.. వాడు ఏ పార్టీ వాడైనా.. ఏ మనిషి అయినా కఠినంగా శిక్షించాల్సిందే.. 8 మంది హంతకుల ముఠా కలిసి ఆ పాప చావుకు కారణమైంద్రు. ఆ ఎనిమిది మందిని జైల్లో పెట్టాలి. ఆ ఎనిమిది మందిని హత్యానేరం కింద అరెస్టు చేయాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం కూడా కచ్చితంగా స్పందించి.. ఈ దుర్మార్గమైన.. అహంకారం, ఆధిపత్యం, అధికార అండతో ఆ పసిగుడ్డును ఎవరు హత్య చేశారో వారిని కఠినంగా శిక్షించాలి.. అవసరమైతే ఉరిశిక్ష వేయాలి. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలి.. కుటుంబంలో చదువుకున్నవాళ్లు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. 'న్యాయం కోసం కుటుంబానికి అండగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, బీఆర్ఎస్ తరఫున కొట్లాడుతున్నారు.. ఈ పోరాటం ఆపకండి.. న్యాయం జరిగే వరకు మీ వెంబడి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఉంటడు. ఒక దీక్షతోనో ఒక ధర్నాతోనో ఈ కుటుంబానికి న్యాయం జరగదు.. న్యాయం జరిగేదాకా.. దుర్మార్గులను శిక్షించే దాకా వదిలిపెట్టను' అని తేల్చి చెప్పారు. 'మానవత్వానికే మచ్చ తెచ్చిన ఇలాంటి దుర్మార్గులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి పెట్టొద్దు.. రాష్ట్ర మొత్తం మీద ఒక సందేశం వెళ్లాలి. ఇట్లాంటివి ఎక్కడ జరిగినా సమాజం ఊరుకోవద్దు. బాధిత కుటుంబానికి అండ గా అంటూ నాగర్‌కర్నూల్ నుంచి సందేశమిద్దాం' అని పిలుపునిచ్చారు. కందనూలులో మాజీ మం త్రి, దివంగత మహేంద్రనాథ్ చూపించిన సామాజిక న్యాయం దక్కేలా ఉన్న ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని, దురదృష్టకరమని వాపోయారు. 'ఆ పసి గుడ్డుకు మనం ఇవ్వగలిగే ఒకే ఒక నివాళి.. పసిపిల్ల చావుకు కారణమైన హంతకులకు శిక్ష పడాలె.. ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చేయడమే' అని తెలిపారు. 'ఇందులో రాజకీయాలు వద్దు.. ఫలానా వారిని తిట్టడం వద్దు.. హంతకులు ఏ పార్టీ వారైనా.. ఎవరైనా.. వాళ్లను శిక్షించే దాకా వదిలిపెట్టం' అని హెచ్చరించారు. 'శాసనసభ సమావేశాలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ లోపల న్యాయం చేసి ఆ ఎనిమిది మందిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టకపోతే.. వారి మీద హత్యా నేరం మోపకపోతే తప్పకుండా శాసనసభలో వదిలిపెట్టం.. గల్లా పట్టి ప్రభుత్వాన్ని అడుగుతాం' అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

**కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్న సీఐ : మాజీ ఎమ్మెల్యే మర్రి**

బాధిత కుటుంబాన్ని దీక్షా శిబిరానికి తీసుకురానివ్వడం లేదని తెలిసి పోలీసులపై మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. 'దాడి జరిగిన సమయంలో ఉన్న సీసీ కెమెరాలు తర్వాత కనిపించలేదని, మీ తప్పే లేనప్పుడు ఎందుకు తీసేశారు?' అని ప్రశ్నించారు. ఫిర్యాదు చేయడానికి వెళితే సీఐ కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తూ కేసు పెట్టకుండా బాధితులపైనే కౌంటర్ కేసు పెట్టించాడని మండిపడ్డారు. గాయపడిన పసిబిడ్డ చనిపోయే సరికి నింద తమపైకి వస్తుందన్న కారణంతో కోర్టు సలహా కోసం పంపామంటూ కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే డీఎస్పీ వద్ద సమాధానం లేదని, నీళ్లు నములుతున్నాడని చెప్పారు. ఘటనకు కారకులైన కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షపడేలా చేయాల్సిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేతో మాట్లాడించడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'మీ తప్పు లేకపోతే బాధితులను పరామర్శించకుండా ఎందుకు ఉన్నారు' అని ప్రశ్నించారు.



## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

**హైదరాబాద్:** అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు.

# పునాదీ నాదే.. పూర్తిచేసేదీ నేనే

**ఒంగోలు:** 'సుమారు 30 ఏళ్ల క్రితం మార్కాపురంలో పర్యటించా. ఇక్కడ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, శ్రీశైలం నీళ్లు అందించాలని కోరారు. 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించా. వచ్చే జులైలో ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పూర్తికాని ప్రాజెక్టును 2024 మార్చిలో జాతికి అంకితం చేస్తున్నట్లు అప్పటి సీఎం జగన్ దొంగ నాటకమాడారని ఎద్దేవా చేశారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో రూ.436 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు బుధవారం సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం సొరంగంలో జరుగుతున్న పనులను దృశ్య మాధ్యమం ద్వారా పరిశీలించి, ఇంజినీర్లతో మాట్లాడారు. ప్రాజెక్టు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ప్రధానాంశాలివీ..

**ఈ ఏడాది వెలిగొండ.. వచ్చే ఏడాది పోలవరం**

పేదలకు దన్నుగా నిలవడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం, పోలవరం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేశాం. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించాను. ఈ ఏడాది వెలిగొండ, వచ్చే సంవత్సరం పోలవరం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. వెలిగొండకు రూ.9 వేల కోట్లు కావాలి. ఇప్పటి వరకు రూ.5,455 కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్ల పనులే చేసింది. 2021 అక్టోబరు 7న ఒంగోలులో జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ 2022 ఆగస్టు నెలాఖరుకల్లా వెలిగొండ పూర్తిచేస్తామని ప్రకటించారు. తర్వాత చీమకుర్తి, మార్కాపురం బహిరంగ సభల్లోనూ ఇదిగో ప్రాజెక్టు పూర్తి చేసేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెట్టారు. చివరకు ప్రాజెక్టు కట్టకుండానే జాతికి అంకితం అంటూ మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసేందుకు మరో రూ.2 వేల కోట్లు కావాలి. మేం వచ్చాక 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు పెట్టాం. మార్కాపురం జిల్లాలో ఫ్లోరైడ్ 2.5- 5 పీపీఎం, కొన్నిచోట్ల 4-7 వరకు ఉంది. ఫ్లోరైడ్ ప్రభావిత ఈ ప్రాంత ప్రజలకు తాగునీరందించేందుకు వచ్చే జులై నాటికి నీళు పారిస్తాం. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు వద్దకు ఏడుసార్లు వచ్చి పరిశీలించారు. ప్రతి సోమవారం ఎంత మేర పని జరిగిందని నివేదిక తీసుకుని, పనితీరు పర్యవేక్షిస్తున్నాం. గోదావరి జలాలను నల్లమలసాగర్‌కు తీసుకొచ్చే పనులు చేపడతాం. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఇక్కడి నుంచి ఉద్యాన ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు చేయూతనిస్తాం. జనం ఓట్లు వేస్తేనే మేమంతా అసెంబ్లీకి వెళ్తు న్నాం. జగన్ మాత్రం ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానంటూ గోల చేస్తున్నారు. నా తల్లిని, భార్యను తిడుతున్నారు. ఎవరెన్ని తిట్టినా లెక్క చేయను. రాష్ట్రం కోసం, రేపటి తరం భవిష్యత్తు కోసం పని చేస్తా. తెదేపాకు అండగా ఉన్న బీసీలను అన్ని రంగాల్లోనూ పైకి తీసుకొస్తా. సామాజిక న్యాయం కోసం ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాం. ప్రజలు మరోసారి వైకుంఠపాళి ఆడొద్దు. కులం, మతం చూసి ఓటేస్తే రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుంది. ఓటుతో అండగా నిలబడితే అభివృద్ధి చేసి చూపిస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ వద్ద హెలికాప్టర్ దిగిన ముఖ్యమంత్రికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల తెదేపా ఇన్‌ఛార్జులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, అధికారులు స్వాగతం పలికారు.

# తెలుగు రాష్ట్రాల్లోతొలి హైటెక్ హైవే

**ఖమ్మం:** సీసీ కెమెరాలు, సోలార్ ప్యానెళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ.. ఇందులోని విశేషాలు. ప్రయాణించిన దూరానికే టోల్ వసూళ్లు, పరిమిత సంఖ్యలో ప్రవేశ (ఎంట్రీ), నిష్క్రమణ (ఎగ్జిట్) ప్రదేశాలు ఇతర ప్రత్యేకతలు. ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఒక్కటీ లేదు. ఇదే మొదటిది అవుతుంది. దీన్ని మే నెలలో ప్రారంభించడానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది.

**56 కి.మీ. దూరం తగ్గినట్టే..**

తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో మొదటిదిగా.. తెలంగాణలోని ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు 162.04 కి.మీ. పొడవున చేపట్టిన రహదారి తుదిమెరుగులు దిద్దుకుంటోంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే సూర్యాపేట, విజయవాడల మీదుగా 676 కిలో మీటర్లు ప్రయాణించాలి. కొత్త రోడ్డు మీదుగా వెళ్తే 56 కి.మీ తగ్గనుంది. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు నిర్మితమైన ఈ రోడ్డుకు ఎన్‌హెచ్-365బీజీగా నంబరును కేటాయించారు.

**రెండు పనులు మినహా పూర్తి..**

ఈ రహదారి నిర్మాణానికి కేంద్రం రూ.4,451.87 కోట్లు ఖర్చు చేస్తోంది. తెలంగాణ పరిధిలోని ప్యాకేజీ-1లో ఒక వంతెన, ఆర్వోబీ నిర్మాణం (బో స్ట్రింగ్ గిడ్డర్) చివరి దశలో ఉండగా.. మిగిలిన



పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో 10 పెద్ద వంతెనలు, 49 చిన్న వంతెనలు, 295 కల్వర్టులు, ఒక ఆర్వోబీ, 98 అండర్‌పాస్‌లు నిర్మించారు. ఖమ్మం జిల్లాలోని వందనం గ్రామం వద్ద ఈ రహదారి నుంచి నాగ్‌పూర్-అమరావతి హైవేకి కలిసేలా అనుసంధాన మార్గం కూడా నిర్మిస్తున్నారు. కర్బన ఉద్గారాల నివారణకు.. నిర్మాణంలో రామగుండం ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ తెచ్చి వినియోగించారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల ఆధారంగా.. ఈ రోడ్డుపై ప్రయాణించిన దూరానికే టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తారు. 'భారతమాల పరియోజన'లో చేపడుతున్న ఈ రహదారిని రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి (ఆర్వో) శివశంకర్ తెలిపారు. కొత్త హైవే విశేషాలను ఆయన, ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య ఖమ్మంలో మీడియాకు వివరించారు.

**నిబంధనలు అతిక్రమిస్తే..**

ఐదు ప్రాంతాల్లో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఏటీఎంఎస్)ను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ సీసీ కెమెరాల ఫుటేజీని వీక్షించే వ్యవస్థ ఉంటుంది. ఎక్కడైనా ప్రమాదం జరిగినా, వాహనదారులు మితిమీరిన వేగంతో నడిపినా, సీటు బెల్టు పెట్టుకోకున్నా, రాంగ్ రూట్‌లో వచ్చినా ఏటీఎంఎస్‌కు సమాచారం అందుతుంది. వెంటనే ఎన్‌హెచ్ అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు. నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానా చలాన్లు పంపిస్తారు. ఏటీఎంఎస్ ద్వారా వాతావరణ సమాచారం కూడా అందుతుంది.

**సీసీ కెమెరాలు.. సౌర దీపాలు**

ప్రస్తుత జాతీయ రహదారుల్లో ప్రధాన కూడళ్లు, ప్రత్యేక ప్రాంతాల్లోనే సీసీ కెమెరాలుండగా.. కొత్త రహదారిపై ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఇది 360 డిగ్రీల కోణంలో పని చేస్తుంది. రోడ్డుకు రెండు వైపులా కిలోమీటరు మేర దృశ్యాలను రికార్డు చేస్తుంది. రహదారిపై సోలార్ ఆధారిత దీపాలను ఏర్పాటు చేశారు. లైటింగ్ స్తంభాలకు అమర్చిన బ్యాటరీలో 12 గంటల పాటు బ్యాక్‌ఆప్ ఉంటుంది. సాయంత్రమయ్యేసరికి ఆటోమేటిక్‌గా దీపాలు వెలుగుతాయి.

**ఎమర్జన్సీ మీడియన్ అత్యవసర స్థితిలో మళ్లించేలా..**

సాధారణ జాతీయ రహదారుల్లా కాకుండా.. కొత్త రహదారిపై కేవలం 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. అంటే సుమారు 18 కిలోమీటర్లకు ఒకటి. ప్రమాదాలు, అత్యవసర సందర్భాల్లో.. బాధితులను తరలించడానికి ప్రతి 5 కిలో మీటర్లకు ఒక ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్‌ను ఏర్పాటు చేశారు.

**సేదతీరే సౌకర్యాలు**

ప్రతి 50 కిలోమీటర్లకు.. రోడ్డుకు రెండు వైపులా ఐదేసి ఎకరాల్లో ప్రయాణికులు సేద తీరడానికి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో హోటళ్లు, పెట్రోల్‌బంకులు, వాష్‌రూమ్స్ తదితరాలుంటాయి. రహదారిపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డులను స్కాన్ చేయడం ద్వారా మీరు ఏ ప్రాంతంలో ఉన్నారు, దగ్గరలోని పోలీసు స్టేషన్, పెట్రోల్‌బంకులు తదితర సమాచారం తెలుస్తుంది.

## మొదటి పేజీ తరువాయి

## కాంగ్రెస్ సిగ్గుపడాలి



భారత్ అవకాశాలు అనే అంశంపై జరిగిన చర్చలో మిడ్‌వెస్ట్ లిమిటెడ్ సీఈవో కొల్లారెడ్డి రామచంద్ర పాల్గొన్నారు.

- వ్యూహాత్మక రంగంలో భారత్ స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవడం అనే అంశంపై జరిగిన చర్చలో వక్తలు.. సైనిక రంగాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. యుద్ధ విమానాలు, నౌకలు, ట్యాంకులను తయారు చేస్తున్నప్పటికీ వాటి ఇంజిన్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక శక్తితోపాటు సైనిక శక్తీ అవసరమేనని, జపాన్, జర్మనీ ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ వాటి సైనిక శక్తి అంత బలంగా లేకపోవడంవల్ల ప్రపంచం వాటిని శక్తిమంతమైనవిగా భావించలేమని పేర్కొన్నారు. భారత్‌కు స్వయం ప్రతిపత్తి ఉండాలని స్వాతంత్ర్యానికి ముందే మహాత్మా గాంధీ భావించారని చెప్పారు.
- ఆహార, ఇంధన భద్రత, డిజిటల్ మార్కెట్ల నియంత్రణపై బుధవారం చర్చించారు.
- పరిశ్రమలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలపై ఏఐ ప్రభావం గురించీ చర్చలు సాగాయి. ఈవీల విప్లవం, ఈవీల దిశగా పరివర్తన, సమస్యలు, సవాళ్లు, అవకాశాలపైనా చర్చలు జరిగాయి.
- సినిమా రంగంపై ఏఐ ప్రభావం గురించి ప్రముఖ దర్శకుడు, నిర్మాత శేఖర్ కపూర్ మాట్లాడారు. రాజమౌళి ఆర్ఆర్ఆర్‌ను రూ.350 కోట్లకుపైగా వ్యయంతో తీశారని, ప్రస్తుతం ఏఐ సాయంతో చౌకగా దానిని తీయవచ్చని అభిప్రాయపడ్డారు. తదుపరి తరంలో సినిమాకు నిర్దిష్ట స్క్రిప్ట్ ఉండదని, థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుడిని బట్టి కథ సాగేలా మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. మూడేళ్లలో తీసే సినిమాను ఏఐతో రెండు రోజుల్లో తీయవచ్చని వివరించారు.

## రాష్ట్రానికి రూ.2,160 కోట్ల 'ఇందిరమ్మ' నిధులు!



అందనున్నాయి. ఇది ఇందిరమ్మ పథకం కొనసాగింపులో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరట ఇవ్వనుంది.

**పట్టణ ప్రాంత యూనిట్లు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఆర్థిక సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి పీఎంఏవై నిధులు అందలేదు. ఆ పథకం కింద నిధులు మంజూరు కావాలంటే, తమ విధివిధానాలను రాష్ట్రాలు కచి?చతంగా అమలు చేయాలన్నది కేంద్రం నిబంధన. కాగా అందులో తేడా వస్తే నిధులు మంజూరు చేయటం లేదు. రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం అమలుకు శ్రీకారం చుట్టినప్పుడు, ఇక్కడ అనుసరించిన పద్ధతులు కేంద్రం విధివిధానాలకు అనుకూలంగా లేవు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తొలి ఏడాది కేంద్రం నుంచి ఎలాంటి నిధులు రాలేదు. రెండో ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. కేంద్ర నిబంధనలకు అనుకూలంగా మార్పు చేర్పులు చేసుకుంది. దీంతో పీఎంఏవై పట్టణ ప్రాంత యూనిట్లు మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2.7 లక్షల యూనిట్లు కావాలని గట్టిగా కోరినప్పటికీ, 1.13 లక్షల యూనిట్లనే కేంద్రం మంజూరు చేసింది. పట్టణ ప్రాంత ఇళ్లకు సంబంధించి యూనిట్ కాస్ట్ రూ.లక్షన్నర ఉండటంతో, ఆ యూనిట్లు ఎంత ఎక్కువ మంజూరైతే అంత ఎక్కువ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టణ ప్రాంత పరిధిని రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా చూపినా, కేంద్రం మాత్రం తక్కువే మంజూరు చేసింది.

**త్వరలో గ్రామీణ ప్రాంత యూనిట్లు**

ఇక వీలైనన్ని గ్రామీణ యూనిట్లు సాధించటంద్వారా ఎక్కు వ నిధులు పొందే యోచనలో భాగంగా 3 లక్షల యూనిట్లు మంజూరు చేయాలని రాష్ట్రం కోరింది. కాగా అర్బన్ యూని ట్లు అడిగినవన్నీ ఇవ్వనందున, గ్రామీణ యూనిట్లు తెలంగాణ కోరినన్ని ఇచ్చే యోచనలో కేంద్రప్రభుత్వం ఉందని స మాచారం. మార్చి రెండో వారంలోగా గ్రామీణ ప్రాంతయూ నిట్లను మంజూరు చేస్తారని రాష్ట్రప్రభుత్వం ఆశిస్తోంది. మంజూరైతే ఒక్కో యూనిట్‌కు రూ.72 వేలు అందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా అమలు చేస్తున్నందున, అందులో రూ.72 వేలు కేంద్రం భరిస్తే అంతమేర రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభిస్తుంది.

## ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు. పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహరావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం.. నిర్భయంగా

## తెలంగాణ రౌండప్

గురువారం26 , ఫిబ్రవరి 2026 పేజీలు 8



## నూతన బోరు ప్రారంభం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

ప్రజలకు తాగునీటి సమస్య ఉందని ఆలాగే రానున్నది వేసవికాలం కావున ప్రజలకు ఇబ్బంది కలగకుండా బుధవారం ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్.డీ.ఎఫ్ నిధులు రూ. 5 లక్షల రూపాయలతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు బావికి సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ కొబ్బరికాయ కొట్టి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా బోరు వేయడం జరిగిందని తెలిపారు. తండా వాసులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేష్, దేవేందర్, తావుర్య, జయందర్, సితి, భారతి మణిపాల్, ప్రేమలత హన్మ మరియు మాజీ ప్రజాప్రతినిధులు మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ పరమేష్, తాండ నాయకులు రవీందర్, ఎల్.ఐ.సి పాండు, డీలర్ కృష్ణ, హరిలాల్, కిషన్, రాజ్ కుమార్, భాస్కర్, హేమ, నరేష్, రవి, శంకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.



### కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

## సన్మానించిన కల్వకుర్తి సబ్ కోర్ట్ పీపీ దంపతులు

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గళం ):**

కల్వకుర్తి మున్సిపల్ చైర్పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ను బుధవారం ఆమె నివాసంలో కల్వకుర్తి సబ్కోర్ట్ పి పి కోట్ల వెంకటరమణ వసుంధర దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



### పెద్దాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన

## గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ

**వెల్దండ ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన సర్పంచ్ కేశ మల్ల అనూష కృష్ణ ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నోజు ప్రసాద్ చారి, వార్డు సభ్యులు, కాటిక అంజయ్య, జక్కుల మల్లేష్, పల్సం శ్రీధర్ ప్రసాద్, తిరుపతి నాయక్, రజిని జన్య నాయక్, తక్కళ్లపల్లి లలిత మల్లయ్య, మమత అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పబ్బు చక్రవర్తి గౌడ్, వరికుప్పల గోవర్ధన్ రాజశేఖర్ లక్ష్మయ్య శివ మహేష్, చిట్టు, తదితరులు పాల్గొన్నారు



## నిందితులలో కఠినంగా శిక్షించాలి

### మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి

**వెల్దండ ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వాళ్లకు కఠినంగా శిక్షించాలని మాదిగల ఐక్యవేదిక మండల అధ్యక్షులు సామేలు, ప్రధాన కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చిన్నారి మృతికి సంతాపం ప్రకటిస్తూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రవర్ణాల చేతిలో దళిత బహుజనులంతా అంచి వేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని,ఇలాంటి దాడులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుద్దటి ప్రభాకర్,మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్,మాజీ ఎంపీటీసీ లింగం ముదిరాజ్, వ్యవస్థాపక కమిటీ నాయకులు పోలే అశోక్, వార్డు నెంబర్ సభ్యులు ముదిగొండ కవిత రమేష్, జంగిలి సునీత ఆనంద్,మాదిగల ఐక్యవేదిక ఉపాధ్యక్షులు మంగళగిరి శ్రీను ప్రచార కార్యదర్శులు, ఈదులపల్లి శ్రీనివాసులు,కట్ట సైదులు,సంయుక్త కార్యదర్శి కొమ్ము నాగయ్య, మీడియా కన్వీనర్ దండు జగన్, జంగిలి రవికుమార్, ఆర్ఎంపీ డాక్టర్ రాజు, ఈదులపల్లి శ్రీనివాసులు గెల్వయ్య,లక్ష్మన్ ప్రసాద్, అంబేద్కర్, శ్రీరాములు, బద్రి లింగం గంగ పోగు ఆంజనేయులు అంబేద్కర్ దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక





### అధ్యక్ష కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్,ముత్యం ముఖేష్ గౌడ్

**కాప్రా,ఫిబ్రవరి 25, (అక్షర గళం) :**





కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి,బెలిదే అశోక్,అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్,యావాపురం రవి,దొమ్మాటి కిరణ్ కుమార్,గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్,సంయుక్త కార్యదర్శిగా డి.శ్రీనివాస్, కె. వెంకట్,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ... కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు.

**ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనల వెల్లువ**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్,ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి,కొత్త రామారావు,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే, ఎస్ఎ. రహీమ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్ తదితరులు అభినందనలు తెలిపారు.

## వెంకటేశ్వర గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్న





### వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 24 (అక్షర గళం ):**

వంగూరు మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి ప్రారంభోత్సవంలో బుధవారం వ్యవసాయ శాఖ కమిషన్ కెవిఎన్ రెడ్డి కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ కొండారెడ్డిపల్లి ఉపసర్పంచ్ వేమారెడ్డి స్వామివారి టెంపుల్ ను సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు.

## అంగన్వాడికి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం





### వెల్జాల్ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ తిరుమల

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గళం ):**

ఆమనగల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వెల్జాల్ సెక్టర్ సూపర్వైజర్ తిరుమల ఆధ్వర్యంలో బుధవారం వెల్జాల్ (3) అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ తిరుమల మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పౌష్టిక ఆహారంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు ప్రతి ఒక్కరూ తీయించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి రాములమ్మ ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి వార్డు సభ్యులు ఎండి సుభాన్ నాయకులు వారణాసి వెంకటేష్ ఏ ఎన్ ఎం సువర్ణ అంగన్వాడి టీచర్ నాశ్రీన్ బేగం ఆయా లక్ష్మమ్మ ఆశా వర్కర్ సరస్వతి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### పసిపాప మరణానికి

## కారకులపై చర్యలు తీసుకోవాలి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**



నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో పాప మరణానికి కారకులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం నాయకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ళ జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. కుమ్మెర మల్లన్న జాతరకు వెళ్లిన కుల వివక్ష పేరుతో రజక కులానికి చెందిన గణేష్ మౌనిక దంపతుల రెండు సంవత్సరాల పసి బిడ్డ మరణానికి కారకులైన వారిని శిక్షించి, బాధిత పేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నేటి ఆధునిక యుగంలో కూడా కుల వివక్ష పేరుతో బాధిత కుటుంబం పై దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించాడు. బిసి కుటుంబానికి చెందిన వారికి జరిగిన అన్యాయాన్ని ప్రతి ఒక్క బీసీలు తీవ్రంగా ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పసిపాప మరణానికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## ప్రజా యుద్ధ నౌక గద్దర్ సేవలు చిరస్మరణీయం

### కౌన్సిలర్ పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

తన పాట ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చిన ఉద్యమాలకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఊపిరి పోశారని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో యుద్ధ నౌక గద్దరన్న విగ్రహావిష్కరణ సభ గోడ పత్రికను సీనియర్ న్యాయవాది లక్ష్మణ్ శర్మ తో కలిసి పాపిశెట్టి రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కెరటం గద్దర్ అని తన పాట ఆట ద్వారా ప్రజల్లో తెలంగాణ రాష్ట్ర సాధన కాంక్షను ఓ ఉద్యమంలా రగల్చారని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లెల నర్సింహా, రజితక్క, బిక్షపతి, బొజ్జన్న, గోపాల్, నర్సింహా, శేఖర్, సుధాకర్, జంగయ్య, పరమేశ్ తదితరులు ఉన్నారు.

# మార్చి 31 లోపు ఇంటి పన్ను చెల్లించకుంటే జరిమాన తప్పదు





## కమీషనర్ మహమూద్ షేక్

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

ఇంటి యాజమానులు మార్చి 31 చివరి నాటికి ఇంటి పన్నులు చెల్లించకుంటే పెనాల్టితో చెల్లించాల్సి వస్తుందని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ హెచ్చరించారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ అధికారులతో ఇంటి పన్నులు వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31 వరకు ఇంటి పన్ను చెల్లించకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెనాల్టితో పన్నులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు భారం పడకుండ ఉండాలంటే ఇచ్చిన గడువు లోపు పన్నులు చెల్లించాలని సూచించారు. గౌరవ జణహీూ, హైదరాబాద్ గారు మరియు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల ఆదేశాల ప్రకారం ఆస్తి పన్ను బకాయిలు 31.03.2026 లోపు పూర్తిగా వసూలు చేయాలనీ ఆదేశాలు జారీ చేయటం జరిగింది. ఆస్తి పన్నులు పూర్తిగా వసూలు చేస్తే 15వ ఫైనాన్స్ నిధులు మంజూరు కావటం జరుగుతుంది అని తెలియజేశారు. మున్సిపాలిటి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న మున్సిపాలిటి పరిధిలో నెల కొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు కావాల్సి ఉంటుందని, ప్రధానంగా మంచినీటి సమస్య నివారణకు వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వాహణ పనులు చేపట్టాలంటే ఖచ్చితంగా నిధులు కావాలని సూచించారు. ఇంటి యాజమానులు తప్పకుండ పన్నుల చెల్లింపులో సంపూర్ణ సహకారం అందించాలని కోరుతున్నామని తెలిపారు. ఆస్తి పన్నులు బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసు ఇవ్వటం జరుగుతుంది అని అయినా కూడా పన్నులు చెల్లించని వారిపై తెలంగాణ పుర పాలక చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుంది అని తెలియజేశారు. పట్టణ పరిధిలో బకాయిలు ఉన్న నల్లా బిల్లులు వెంటనే చెల్లించాలని, వ్యాపారస్థులు అందరూ తమ వ్యాపారమునకు ట్రేడ్ లైసెన్స్ లు తీసుకోవాలని తెలిపారు. బకాయిలు ఉన్న పన్నులు వెంటనే చెల్లించి పట్టణభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈ. షబ్బీర్ అహ్మద్, మేనేజర్ వి ఎల్ పి. రాజ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.




## మదినాగూడలో కబ్జా స్థలాన్ని పరిశీలించిన సీఐ బాలగోపాల్

**అక్షర గళం , మదీనాగూడ :**

మదీనాగూడ లోని పోచమ్మ ఆలయాన్ని ఆనుకొని కబ్జా చేసిన స్థలాన్ని బుధవారం సిఐ బాలగోపాల్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోచమ్మ ఆలయాన్ని ఆనుకొని కబ్జా చేసిన విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి కాంగ్రెస్ నేత మిద్దెల మల్లారెడ్డి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన రంగనాథ్ ,సిఐ బాలగోపాల్ ని ఘటన స్థలానికి పంపి పరిశీలించి చర్య తీసుకోవాలని తెలిపారు. సిఐ బాలగోపాల్ పని ముందుకు జరగవద్దు అని టౌన్ ప్లానింగ్ టిపిఎస్ రమేష్ కి , ఇంటి యజమాని కృష్ణ కి ఫోన్ చేసి చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం మిద్దెల మల్లారెడ్డి దగ్గరుండి చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి రంగనాథ్ చాలా అభినందించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో మిద్దెల మల్లారెడ్డి మదీనాగూడ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు పరిశీలించిన కమిషనర్ ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తిరుమల వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**



కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తిరుమల తిరుపతి వెంకన్నను దర్శించుకున్నారు. బుధ వారం ఉదయం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి తిరుపతి దేవ స్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహి ంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిరుధ్ రెడ్డి లను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## మహిళా శక్తి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ మొక్తాల రమేష్

**వెల్దండ ఫిబ్రవరి 25 (అక్షర గళం) :**

వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లోని పల్లి గ్రామంలో రూ,10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా శక్తి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ మొక్తాల రమేష్ పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ వార్డ్ నెంబర్ సభ్యులు సుమతమ్మ స్వాతి శివరాజ్ ఏ ఈ సురేందర్ రెడ్డి జంగయ్య మహేష్ యాదయ్య హుస్సేన్ శ్రీను లక్ష్మయ్య బాలరాజ్ రాజేష్ రెడ్డి వెంకటయ్య ప్రభాకర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# సమాజంలో ఉపాధ్యాయులు కీలకం




## మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

## అంకితభావానికి ప్రతీకగా నిలిచిన ఉపాధ్యాయురాలు బుచ్చమ్మ

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకమని మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా సేవలందించిన బుచ్చమ్మ బుధవారం పదవీ విరమణ పొందినారు. ఈ సంద ర్భంగా పాఠశాల ఆవరణలో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి హాజరై బుచ్చమ్మ ను శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో బుచ్చమ్మ అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని ఆయన కొనియాడారు. ఆమె బోధన ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల ప్రేమ, క్రమశిక్షణ, అంకితభావం ఆమె వ్యక్తిత్వానికి ప్రతీకలని అన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, భవిష్యత్తులో వారి సేవలు విద్యార్థులకు మరియు కడ్తాల్ పాఠశాలలకు ఎల్లప్పుడూ అందించాలని కోరారు. పదవీవిరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విర మణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగ య్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు గోపాల్ నాయక్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ రెడ్డి, మల్లయ్య, ధనుంజయ గౌడ్, ఇంద్రా రెడ్డి, కౌసల్య, శ్వేతమాధురి, పద్మమ్మ, భాగ్యమ్మ, సంగీత గ్రామ స్తులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## 3వ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### మున్సిపల్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి అన్నారు. బుధవారం ఉదయం చైర్ పర్సన్ 3వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య విధి దీపాల, కరెంట్ స్తంభాల సమస్యను వార్డు ప్రజలు తీసుకు వెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యకు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం స్థానిక నాయకులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయ కులు పత్యనాయక్, సక్రూ నాయక్, మణిపాల్ నాయక్, బాలు నాయక్, రవి రాథోడ్, బిందు రాథోడ్, శివరాం నాయక్, రమేష్, రాములు, బాల్ రాజ్, రతన్, దేవుల, బిచ్చ, శ్రీను, హాథిరామ్ తదితరులు పాల్గొన్నారు.




## వేరుశెనగపంట సాగుపై రైతులకు అవగాహన

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

వేరుశనగ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో వేరుశెనగ సాగుచేసిన సంకటోనిపల్లి, ముర్తుజాపల్లి, మంగళపల్లి గ్రామాలకు చెందిన రైతులకు వేరుశెనగ పంట సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. వేరుశెనగ పంట వేయడానికి ముందు విత్తన శుద్ధి ఎలా చేయాలి ఎలాంటి ఎరువులు వేయాలి అన్న అంశాలపై రైతులకు సూచనలు సలహా ఇచ్చినట్టు తెలిపారు. పంట నష్టం కలిగించే వేరు పురుగుల నివారణకు వానపాములు అభివృద్ధి చేయడం కీటక సహకార మందులు వాడడం కృత్రిమ ఎరువులను తయారుచేసి పంటకు వాడడం ఎలా చేయాలి అంశాలపై రైతులతో చర్చించినట్లు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వేరుశనగ వేసే రైతులకు తీసుకోవాలని జాగ్రత్తల గురించి వాటికి వాడవలసిన క్రిమిసంహారక మందులు ఎలాగా పిచికారి చేయాలి అనే అంశాలను రైతులకు వివరణ ఇచ్చినట్టు తెలిపారు. సహజ సిద్ధమైన వనరులతో పంటలు పండించడం ఎలాగో రైతులకు తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ మరియు రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించాలి

## ఈసీఐఎల్ చౌరస్తాలో 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన -2026' ఫేజ్-2 నిర్వహణ

**కుషాయిగూడ, ఫిబ్రవరి 25, (అక్షర గళం) :**






రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా వద్ద "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్--2026" (ఫేజ్--2) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ డివిజన్ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి హాజరై వాహనదారులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు, కుటుంబాలపై పడే ప్రభావం, చట్టపరమైన చర్యలు మరియు ప్రాణనష్టం వంటి అంశాలను నొక్కి చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారితీస్తుందని హెచ్చరించారు. కుషాయిగూడ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్సైలు ఎన్. సుధాకర్ రెడ్డి, ఎన్. వెంకన్న, సిహెచ్. సాయిలు, ఎం. విజయ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 50--60 మంది వాహనదారులు, స్థానికులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు. ఫిబ్రవరి 22 నుండి 28 వరకు ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో అవగాహన ర్యాలీలు, ప్రత్యేక తనిఖీలు, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. "సురక్షితంగా ప్రయాణించండి -- సురక్షితంగా గమ్యానికి చేరుకోండి" అనే సందేశంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

## పసిప్రాణాన్ని తీసిన వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించాలి

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు జూపల్లి నరేష్

**ఘట్కేసర్,ఫిబ్రవరి 25,(అక్షర గళం) :**



తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మర గ్రామంలో మల్లన్న జాతరలో కుల వ్యవస్థ చూపుతూ బలహీన వర్గాలకు చెందిన రజక జాతికి చెందిన రెండు నెలల పసి గుడ్డును ఆ గ్రామ సర్పంచ్ రెడ్డి తొక్కి చంపడం చాలా బాధాకరమని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు జూపల్లి నరేష్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలయిన గడిసిన కూడా ఈ కులవ్యక్షత చూపుతో ప్రాణాలు తీయడం అంటే ఇంత శోచనీయము ఒకసారి భారతదేశ ప్రజలందరూ ఒకసారి ఆలోచించాల్సిన విషయం కులాన్ని దూషించుతూ తొక్కించి పంపడం అంటే సమాజం ఎటు పోతుందో ఒకసారి ఆలోచించాలి. రెండు నెలల పసిగుడ్డును తొక్కి చంపిన వ్యక్తిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు శిక్ష పడకుండా చూస్తుందంటే బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం ఏం న్యాయం..? ఒకసారి ఆలోచించండి బీసీ సమాజమంతా తెలుసుకోవలసిన విషయం ఇకనైనా బీసీలంతా ఒక తాటికొచ్చి రజక జాతికి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఈ విషయంపై ఖండించకపోవడం చాలా బాధాకరం రజక జాతికి న్యాయం చేయకపోవడం సిగ్గు సిగ్గు ఇకనైనా ప్రభుత్వాన్ని మోచేతి నీళ్లు తాగడం ఆపి ఎప్పటికప్పుడు రజక జాతికి మీరు జరిగిన చూడాల్సిన కోరుకుంటున్నాను ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా బీసీ మంత్రులకు బీసీ నాయకులకు చూడాల్సిందిగా కోరుచున్నాము ప్రభుత్వాన్ని కోరింది ఒకటే పసిప్రాణాన్ని తీసిన వ్యక్తిని చట్ట ప్రకారం శిక్ష పడాల్సిందిగా కోరుచున్నాము.

# నల్లకన్ను మరణం దేశానికి తీరని లోటు

## సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ సహాయ కార్యదర్శి దార దాసు.

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గలం) :**



దేశంలోనే అత్యంత సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, ప్రజా జీవితంలో శాశ్వత నైతిక శక్తి అయిన ఆర్. నల్లకన్ను మరణం పట్ల భారత కమ్యూనిస్ట్ పార్టీ తో పాటు భారతదేశానికి తీరనిలోటని సిపిఐ పార్టీ నియోజకవర్గ కల్వకుర్తి సహాయ కార్యదర్శి ధార దాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మరణం భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో మరియు కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో ఒక శకానికి ముగింపు పలికింది. కామ్రేడ్ ఆర్. నల్లకన్ను 1925 డిసెంబర్ 26న ప్రస్తుత తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలోని తిరువైకుంటంలో జన్మించారు. ఆయన జన్మదినం భారత కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన దినోత్సవంతో సమానంగా జరిగింది, ఈ సమావేశం తరువాత పార్టీకి మరియు దాని ఆదర్శాలకు పూర్తిగా అంకితమైన జీవితంలో ప్రతిబింబిస్తుంది. నిరాడంబరమైన వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చిన ఆయన అన్యాయం, అసమానత మరియు వలసవాద అణచివేత ప్రశ్నలకు ముందుగానే ఆకర్షితులయ్యారనీ. ఆయన చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో మరియు కమ్యూనిస్ట్ ఉద్యమంలో చేరి బ్రిటిష్ పాలన మరియు భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సామూహిక పోరాటాలలో మునిగిపోయారు. తన రాజీలేని రాజకీయ కార్యకలాపాలకు గాను, ఆయన తీవ్రమైన అణచివేతను ఎదుర్కొన్నారనీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత, కామ్రేడ్ నల్లకన్ను అరుదైన నైతిక స్థాయి కలిగిన ప్రజా నాయకుడిగా ఎదిగారని ,అవిశ్రాంతంగా నిర్వాహకుడిగా మరియు నిబద్ధత కలిగిన సామాజిక సంస్కర్తగా, లౌకికవాదం, సామాజిక సమానత్వం, హేతువాదం మరియు ప్రజాస్వామ్య విలువలను దృఢంగా సమర్థిస్తూ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు మరియు సమాజంలోని అన్ని అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం తన స్వరాన్ని వినిపించారనీ తెలిపారు. ఆయన జూ× తమిళనాడు రాష్ట్ర మండలి కార్యదర్శిగా విశిష్ట సేవలందించారు, మార్క్సిస్ట్ భావజాలం, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం మరియు నిరంతర ప్రజా పోరాటాలలో పాతుకుపోయిన సూత్రప్రాయమైన నాయకత్వాన్ని అందించారు. ఆయన పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మరియు కేంద్ర నియంత్రణ కమిషన్ ఛైర్మన్‌గా కూడా సేవలందించారనీ ఆయన పేర్కొన్నారు.



## కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం

**కల్వకుర్తి ఫిబ్రవరి 25(అక్షర గలం) :**



మున్సిపల్ ఎన్నికలలో గెలుపొంది పదవి బాధ్యతలు చేపట్టి చైర్మన్ గా ఎన్నికైన బృంగి రత్న మాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ శాన్ వాజ్ ఖాన్ లను బుధవారం కల్వకుర్తి పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో పూల మాలలు, శాలువాతో గుండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నంబి శంకర్, సీనియర్ నాయకులు డాక్టర్ వెంకటయ్య, పోతుగంటి రాజు, ఎన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబెర్స్ పోతుగంటి అశోక్, మెంట జంగమ్మ లింగమ్మయ్య, నాయకులు మెంట భీమయ్య,పోతుగంటి పెద్ద నాగయ్య, తుంగభద్ర వెంకటయ్య,గోరటి శ్రీశైలం మొగిలి రమేష్, నంబి ఆంజనేయులు, నంబి వెంకటయ్య మెంట శ్రీశైలం, నవీన్, మహేందర్, జానీ తదితరులు పాల్గొనారు.

## చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి.

### నిందితులందరీని అరెస్టు చేయాలి

### సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ సహాయ కార్యదర్శి దార దాసు

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గళం):**



నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ కలకుర్తి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ధారా దాసు డిమాండ్ చేశారు. సంద ర్భంగా ఆయ న మాట్లా డుతూ అగ్ర కుల అహం కారంతో బీసీ దళిత కుటుంబానికి చెం దిన వారిపై అమా నుషంగా దాడి చేసి పసికందు మర ణానికి కారణమైన వాళ్లపై హత్యకేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు నమోదు చేయాలి అన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుల దురంకార హత్యలు జరగ కుం డా బీసీ ఎస్సీ ఎస్టీలపై భౌతిక దాడులు భవి ష్యత్తులో జరగకుండా నివారి ంచాలంటే కుమ్మెర నిందితులను కఠినంగా శిక్షించాలి అని పేర్కొన్నారు. బాధిత కుటుంబలకు ప్రభుత్వపరంగా పది లక్షలు రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించాలి అని ఆయన డిమాండ్ చేశారు. కేసు ఘటనలో ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తలగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.





## మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**కల్వకుర్తి ఫిబ్రవరి 25(అక్షర గళం):**

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు తెలుగు పరీక్ష కల్వకుర్తిలో ప్రశాంతంగా జరిగాయి. ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రోజు పరీక్షలకు మొత్తం 7 సెంటర్లలో 1,700మందికి గాను 1,642మంది పరీక్షలకు హాజరైనట్లు 58 గై హాజర్ అయినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్ రెడ్డి వెల్లడించారు.




## కల్వకుర్తి: రెండో రోజు కొనసాగిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

**కల్వకుర్తి (అక్షర గళం):**

ఫిబ్రవరి 25.న్యాయవాదులకు రక్షణ చట్టం ప్రవేశపెట్టాలని కోరుతూ కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలలో న్యాయవాదులు ఎండీ జమీల్ అహ్మద్, రాంగోపాల్, నాగరాజు, శివకుమార్, శ్రీకాంత్ కూర్చున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టం తెచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# ఇంటర్ పరీక్షలు షురూ..





## తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

### ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరంలో తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 430 మందికి గాను 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రమీలమ్మ జూనియర్ కళాశాల, కడ్తాల లోని బ్రిలియంట్, ఎస్.వి.ఎస్ జూని యర్ కళాశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పరీక్షల సూపరింటెండెంట్ మాధవ రావ్, డిపార్ట్మెంట్ అధికారి వసుంధర పరిశీలించారు.



## డ్రైనేజీ, రోడ్లు లేక కాలనీ ప్రజలు ఇబ్బందులు



### చైర్మన్, వైస్ చైర్ పర్సన్ లకు వినతిపత్రం అందించిన కౌన్సిలర్ మహేష్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని ఆ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తొలి సాధారణ సమావేశం అనంతరం ఛైర్మెన్ పత్యానాయక్, కమిషనర్ శంకర్ నాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ.. శ్రీకాంత్ కాలనీలో మౌళిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కాలనీలో రోడ్లులన్నీ గుంతలుగా ఉన్నాయని, వర్షపు నీరు నిల్వ ఉండి, మురికి నీరు కాలనీలో రోడ్లపైనే ఉండటం వలన దోమలు, పందులు, సైర్య విహారం చేసి ప్రజలు అనారోగ్యాల పాలవు తున్నారన్నారు. వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట 14వ వార్డు కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (అక్షర గళం):**



సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ మండపంలోని కళ్యాణ వేదికను పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కళ్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పూజారుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు పాపిశెట్టి శ్వేత రాము దంపతులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత, క్రమశిక్షణ నిజాయితీగా జీవించడానికి అలవాటును నేర్పిస్తుందన్నారు. ప్రతీ వ్యక్తి భక్తిభావాన్ని అలవరుచుకోవాలన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడుపొద్దు ఎస్సై కురుమూర్తి

**వెల్దండ ఫిబ్రవరి 25 (అక్షర గళం) :**



ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్సై కురుమూర్తి సూచించారు వెల్దండ మండల పరిధిలోని కోట్ర చౌరస్తాలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎస్సై కురుమూర్తి వాహనాలను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేశారు ఇద్దరు వాహనదారులు మద్యం తాగి నడుపుతూ వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ. రోడ్డుపై తమ వాహనాలు డ్రైవింగ్ చేసే సమయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. హెల్మెట్ సీటు బెల్టు పెట్టుకొని వాహనాలను నడపాలన్నారు. పరిమితికి మించి వేగం నడపడం సరైనది కాదన్నారు. సూచించారు. రోడ్లపై ప్రయాణిస్తూ వాహనాలకు సంబంధించిన పత్రాలు వాహనాలలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఫోన్లో మాట్లాడుకుంటూ, రాంగ్ రూట్ వాహనాలు నడపవద్దని ఎస్సై కురుమూర్తి తెలిపారు







## నియోజకవర్గస్థాయి వేగా9 ౦10 ప్రీమియర్ లీగ్ ప్రారంభం

**కల్వకుర్తి ఫిబ్రవరి 25 (అక్షర గలం) :**

జడ్చర్ల పట్టణంలో డిగ్రీ కాలేజ్ మైదానంలోవేగా9 ౦10 ప్రీమియర్ లీగ్ మ్యాచును బుధవారం జడ్చర్ల సీఐ కమలాకరు,మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత కాల్వ రామ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరం, యువత చెడు మార్గంలో వెళ్లకుండా క్రీడలపై ఆసక్తిని పెంచుతుందని తెలిపారు, అనంతరం టోర్నమెంటుకు సంబంధించిన జెర్సీలను ఆవిష్కరించారు, తొలి మ్యాచ్ లో భాగంగా ఎం జె ఆర్ రైజర్స్ మరియు రెహాన్ తుఫాన్ టీమ్ లు తలపడగా ఎం జె ఆర్ రైజర్స్. 13 పరుగులతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ ఆర్గనైజర్స్ ఒస్పాన్సర్స్. సతీష్, గోవర్ధన్, మహేష్, నరసింహ, సాయి,ఓర్సు నరేష్, కోట్ర భరత్,అశోక్ రెడ్డి, కొండేడు సురేష్, సంతు చారి,ఈటె శీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**వెల్దండ ఫిబ్రవరి 25 (అక్షర గళం):**

వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మోడల్ స్కూల్ పాఠశాలలో ఇంటర్ ప్ర థమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి మోడల్ స్కూల్ పాఠశాలలో మొత్తం 154 మంది విద్యార్థుల గాను 151 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 160 మందికి విద్యార్థులకుగాను 156 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ గోపాల్ రావు తెలిపారు పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు

# చిగురాశలపై పిడుగుపాటు

సమాజంలో ఉండే అసమానతలకూ, అంతరాలకూ చట్టాల ద్వారా, మధ్యవర్తిత్వంతో సహా ఇతరేతర మార్గాల ద్వారా సామరస్యపూర్వకమైన పరిష్కారం సాధించటం రాజ్యం చేయాల్సిన పని. అందుకు రాజ్యాంగం, దాని ద్వారా ఏర్పడే భిన్న వ్యవస్థలు పనిచేస్తుంటాయి. కుటుంబాల్లో తరాల మధ్య తలెత్తే సమస్యలకు కూడా ఆ పరిధిలోనే పరిష్కారాలుంటాయి. ఇతరత్రా సమస్యల మాటేమో గానీ, పెళ్లి విషయంలో మాత్రం అదేం కుదరదంటున్నది గుజరాత్ ప్రభుత్వం. వివాహం గురించి తల్లిదండ్రులకు చెప్పి, వాళ్ల అనుమతి తీసుకోవాలని ఆంక్షలు విధించటానికి సిద్ధపడుతోంది. ఇందుకోసం 2006 నాటి వివాహ నమోదు చట్టాన్ని సవరించదల్చుకున్నట్టు ప్రకటించింది. పరస్పరం ఇష్టపడి పెళ్లాడాలనుకునే జంటలకు ఇప్పటికే అనేకానేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కులాలు, మతాలు, ప్రాంతాలు, ఆర్థిక అసమానతలు అందులో కొన్ని. ఈ గోదాలోకి తాను కూడా జొరబడి గుజరాత్ సర్కారు ఏం సాధించదల్చుకున్నదో అనూహ్యం. ప్రజాస్వామ్యంలో 18 ఏళ్ల వయసు నిండినవారు ఓటేయటానికి, పోటీ చేయటానికి అర్హులు. ప్రభుత్వాలను మార్చవచ్చు. జనం ఆమోదం పొంది ఎన్నికైతే ప్రభుత్వంలో భాగమై విధానాలు రూపొందించవచ్చు. కానీ ఆ వయసువారు తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకోవటానికి వీల్లేదని, అందుకు మరొకరి ఆమోదముద్ర తప్పనిసరని అనటం ఆశ్చర్యకరం. ఇలాంటి తలకిందుల ఆలోచనలు చేయటం గుజరాత్‌తోనే మొదలు కాలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఈ పనే చేశాయి. ఎనిమిదేళ్ల క్రితం కేరళకు చెందిన హదియా అనే యువతి కేసులో... తనకు నచ్చిన జీవితభాగస్వామి ఎవరో నిర్ణయించుకునే స్వేచ్ఛ మైనారిటీ తీరిన ప్రతి ఒక్కరికీ ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ బంధంలో తల్లిదండ్రులు గానీ, కుల మత పెద్దలు గానీ జోక్యం చేసుకోవడం చెల్లదని చెప్పింది. నచ్చిన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవటం రాజ్యాంగం 21వ అధికరణం ద్వారా ప్రసాదించిన జీవించే హక్కులో భాగమని కూడా తెలిపింది. 2021లో అలహాబాద్ హైకోర్టు, కర్ణాటక హైకోర్టులు సైతం ఈ సంగతినే స్పష్టం చేశాయి.గత వారం గుజరాత్ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి వివాహ నమోదు చట్టాన్ని సవరించాలనుకోవటానికి చూపిన కారణాలు హాస్యాస్పదమైనవి. పెళ్లిళ్ల నమోదు నిబంధనల్ని కఠినతరం చేయాలని వివిధ సామాజిక సంస్థల నాయకుల నుంచి వినతులొచ్చాయట. బాధ్యతాయుతమైన ప్రభుత్వమైతే అది అసాధ్యమని వారికి నచ్చజెప్పాలి. వివాహాల నమోదు చట్టం రాష్ట్రాల పరిధిలోనే ఉంటుంది. దాన్ని సవరించే హక్కు కూడా ఉంటుంది. కానీ అది రాజ్యాంగానికి లోబడి ఉండాలి. అసలు ఇప్పుడు తీసుకురాదల్చుకున్న సవరణల్లో స్పష్టత లేదు. పెళ్లి గురించి తల్లిదండ్రులకు చెప్పారా లేదా అని అడగటం, వారికి చెప్పాలని నిబంధన విధించటం తప్ప వారు అంగీకరించని పక్షంలో చట్టం ఏం చేస్తుందో, పర్యవసానాలెలా ఉంటాయో చెప్పటం లేదు. పెళ్లి నమోదు చేస్తారా లేదా అన్న విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ఇది అతి తెలివి. ఏదో రకంగా పెళ్లి సంగతి తల్లిదండ్రుల చెవినబడితే చాలు... ఆ తర్వాత వాళ్లూ వాళ్లూ పడతారని చేతులు దులుపుకోవటం! ఇలాంటి సందర్భాల్లో మన దేశంలో ఏమవుతున్నదో కనబడుతూనే ఉంది. తమ కులంవాడు కాదని, 'తక్కువ' కులస్థుడని అనుకున్న మరుక్షణం హంతకులుగా మారు తున్న తల్లిదండ్రులు కోకొల్లలు. కనీసం ఇప్పుడైతే కొంత కాలం గడిచాకనో, బిడ్డ పుట్టాకనో ఆవేశం తగ్గించుకుని అక్కున చేర్చుకుంటున్నవారు అక్కడక్కడ కనబడు తున్నారు. ఈ చట్టం కనీసం అందుకు కూడా అవకాశం ఇవ్వదల్చుకున్నట్టు లేదు. కొన్నేళ్ల క్రితం 'లవ్ జిహాద్' మాట తెగ ప్రచారం చేశారు. ప్రేమ పేరిట మతాంతీకరణ జరుగుతున్నదని భూమ్యాకాశాలు ఏకం చేశారు. 'కేరళ ఫైల్స్' చిత్రం దాని ఆధారంగానే నిర్మించారు. కానీ ఆ వంకన మతాంతర వివాహాలను వివాదాస్పదం చేయటం తప్ప సాధించిందేమీ లేదు. రాజకీయపక్షాలు తమ ప్రయోజనాల కోసం ఏమైనా చెబుతాయి. రాజ్యం అలాంటి అంశాల్లో ఆచితూచి వ్యవహరించాలి. ఉన్న సమస్యల్ని పెంచకూడదు. తానే సమస్యగా మారకూడదు.

## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

**హైదరాబాద్:** ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

**హైదరాబాద్:** యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్‌ను ఇంస్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్‌కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ పరిశీలనలో ఆడబిడ్డ నిధి పథకం

**అమరావతి:**ఆడబిడ్డ నిధి పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచిందని మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచామని, ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఏపీ శాసనమండలిలో 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు లేవనెత్తారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇచ్చే ఉద్దేశం ఉందా' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో సభలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పలు స్కీమ్‌లలో జరిగిన లోపాలను మంత్రి శ్రీనివాస్ చెబుతున్నారని తెలిపారు. చివరకు.. అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఆ ప్రశ్నకు సమాధానం వచ్చినట్లుగా ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రకటించారు

## పాక్‌లో ఆకాశాన్నంటిన పళ్ల ధరలు

**లాహోర్:**పాకిస్థాన్ చాలా ఏళ్లుగా తీవ్ర ద్రవ్యోల్బణంతో సతమతమవుతోంది. ఆ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు తార స్థాయికి చేరాయి. ముఖ్యంగా పళ్ల ధరలు భారీగా ఉన్నాయి. రంజాన్ వేళ పళ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. పాకిస్థాన్‌లోని పండ్ల మార్కెట్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక వ్లాగర్ పండ్ల మార్కెట్లోని ధరలను వెల్లడించాడు. భారతీయ వ్లాగర్ రిజ్వాన్ ఒక దుకాణదారుడిని పండ్ల ధర గురించి అడిగాడు. ముందుగా పాక్‌లో కిలో అరటిపళ్లు 300 నుంచి 400 పాక్ రూపాయల వరకు ఉన్నట్టు దుకాణదారుడు చెప్పాడు.

# ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ

### ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది. ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'.. ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మాత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

# హెరిటేజ్‌కు వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

### జగన్ చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలా

### బొత్స దృష్టిలో గజదొంగ అంటే జగనా

### మీడియా చాట్‌లో లోకేశ్

**అమరావతి:** బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా.. అని ప్రశ్నించారు. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకి తానెందుకు సమాధానం చెప్పాలి.. అని నిలదీశారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు.జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నారా అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు.చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా.. అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేకు ఓ యూనివర్సిటీ పెట్టామని, రెసిడెన్షియల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియేనీటేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు అని ప్రస్తావించారు. తాము అంతా విద్యార్థులమేనని.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావేశాలు.. రాజకీయాలకు అతీతమని... ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరించారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షపై కన్వీనర్‌తో టి-సాట్ స్పెషల్ లైవ్

**హైదరాబాద్:** మే నెలలో నిర్వహించే ఎప్ సెట్ పోటీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు టి-సాట్ నెట్వర్క్ ఈ నెల 26వ తేది గురువారం రోజు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. లైవ్ కార్యక్రమంలో తెలంగాణ ఎప్ సెట్ కన్వీనర్ కె.విజయ్ కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు పలు సలహాలు-సూచనలు అందించనున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, కోర్సులలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ మే 13, 14 తేదిల్లో నిర్వహించనుంది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తోడ్పాటుగా టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. టి-సాట్ నిపుణ ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు జరిగే లైవ్ కార్యక్రమంలో పాల్గొనే కన్వీనర్ విజయ్ కుమార్ విద్యార్థుల సందేహాలకు సమాధానం ఇవ్వడంతో పాటు సలహాలు అందించనున్నారు. ఎప్ సెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి తల్లిదండ్రులు 040-23556037, 23553473 టోల్ ఫ్రీ నెం.1800 425 4038 నెంబర్లకు కాల్ చేయాలని టి-సాట్ నెట్వర్క్ కోరింది. ఇప్పటికే ఎప్ సెట్ పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ నాలుగు గంటల పాఠ్యంశాల ప్రసారాలను కొనసాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే. తెలంగాణ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష మరియు పోలీసు శాఖలో భాగమైన ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'చైల్డ్ సేఫ్టీ' పేరుతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమం కొనసాగనుంది. పిల్లల రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పిల్లలకు ఇబ్బందులు ఎదురైతే ఎవరిని సంప్రదించాలి, విద్యార్థి దశలో ఎటువంటి విషయాల జోలికి వెళ్లకూడదు అనే తదితర ప్రధాన అంశాలపై విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమం టి-సాట్ విద్య ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు ప్రసారమౌతుంది. విద్యార్థినీ, విద్యార్థులు తమ సందేహాలు -సమాధానాల కోసం 040-2354 0326, 2354 0726 టోల్ ఫ్రీ నెం.1800 425, 4039 నెంబర్లకు కాల్ చేయాలి. టి-సాట్ నెట్వర్క్ ఈ మేరకు సూచించింది.

# ఇంటర్ పరీక్షలకు సైబరాబాద్ పోలీసుల పటిష్ట బందోబస్తు

### ప్రత్యేక పోలీస్ బృందాలతో విద్యార్థులకు సహకారం

**హైదరాబాద్:**ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు లేదా తప్పుడు అడ్రస్‌తో వేరే కేంద్రానికి చేరుకున్న వారిని వెంటనే గుర్తించి, పోలీస్ వాహనాల ద్వారా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేర్చారు. ఇప్పటివరకు దాదాపు నలుగురు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు సరైన పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్షల బందోబస్తును పరిశీలించేందుకు కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పాటు సహాయక చర్యలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ్ వర్ధన్ బందోబస్తు సిబ్బందిని సమీక్షించి, పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మచిలీపట్నంలో పట్టపగలే భారీ దోపిడి

**మచిలీపట్నం:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ.1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

## దొంగతనాలకు అలవాటు పడ్డ ఉద్యోగి

**విజయవాడ:** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రూరల్ మండలం చిక్కుళ్లగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ నంద సుభాష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద సుభాష్ చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో బైక్ చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌పైనే వృద్ధురాలైన ఉప్పు అనసూర్య మెడలో 40 గ్రాముల బంగారు నాన్తాడు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. తిరువూరు సీఐ కే. గిరిబాబు నిందితుడిని లక్ష్మీపురం శివారులో అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## భవన నిర్మాణాలు పరిశీలించిన కేంద్ర కార్యదర్శి

**గుంటూరు:**గుంటూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కేంద్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజకు సూచించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం నాటికి ఆ భవనాలను ప్రారంభించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగసాయి కుమార్ పలువురు అధికారులు ఉన్నారు.

## బాలిక పునర్విక వైద్యం కోసం సాయం

**అమరావతి:** ఎస్ఎంఏ టైప్ -1తో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే బాలిక చికిత్సకు సాయం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ ముందుకొచ్చారు. సాయం చేయాలని బాలిక తల్లిదండ్రులు 'ఎక్స్'లో అభ్యర్థించడంతో మంత్రి స్పందించారు. ఈ అరుదైన వ్యాధితో కండరాలు క్రమంగా బలహీనపడతాయన్నారు. ఈ స్థితిలోనూ ధైర్యంగా పునర్విక పోరాడుతున్న తీరును కొనియాడారు. ఆమె ఇంజక్షన్‌కు రూ.16 కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే దాతలు స్పందించి రూ.10 కోట్లు సమకూర్చడం హర్షణీయమన్నారు. మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని చెప్పారు. ప్రతి ఒక్కరూ సాయం అందించాలని కోరారు. ఈ అంశంపై మంత్రి నారా లోకేశ్ స్పందించడంపై సినీ నటుడు మంచు మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

## మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం:** రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీపాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు. కొన్ని కేంద్రాల్లో ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని, అత్యధిక కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బాదం పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం ఘటనలో కల్తీ పాలు తాగడం వల్ల పలువురు మృతి చెందగా.. మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

## సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

**హైదరాబాద్:** హైదరాబాద్ చిత్రపురి కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఇలా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నగరంలోని ఓ ప్రముఖ కాలేజ్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి.. చిత్రపురి కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన కోమలి.. తక్కువ కాలంలో యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. కోమలి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిని ప్రేమించింది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ అయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం కోమలి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు కాపాడారు. ఈ మధ్య మరోసారి ఆ యువకుడితో గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది.

## మీడియా అకాడమీ ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్:** తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు.

## ఇజ్రాయిల్ పర్యటనకు బయలుదేరిన ప్రధాని

**న్యూఢిల్లీ:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా స్వాగతం పలకనున్నారు. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు యావత్ ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. ప్రధాని మోదీ రాకను ప్రకటిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు. ఈ రెండు రోజుల్లో ప్రధాని మోదీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు(బుధవారం) మోదీ.. నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొంటారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇరుదేశాల స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌నకు మోదీ పర్యటన ముందడుగుగా నిలుస్తుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

## మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోడీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం. గాజాను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజలను చంపుతోంది. మీకు తెలుసా..మోడీకి ఇజ్రాయిల్‌ని సందర్శించడం గుజరాత్‌ను సందర్శించడం లాంటిది' అని సందోష్ కుమార్ అన్నారు.

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

## వేర్వేరు ప్రాంతాల్లో ప్రేమ జంట ఆత్మహత్య

**వనపర్తి:** వనపర్తి జిల్లాకు చెందిన ప్రేమ జంట వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కేత్రావత్ వసంత అనే యువతి బాసర ఐఐటీ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.వనపర్తి మండలం అప్పయ్య పల్లి శివారులోని కిర్యా తండా చెందిన గణెళిష్ కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఈ ఇద్దరు చనిపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. వసంత, గణెళిశ్.. ఇద్దరూ బంధువులు అని తెలిసింది. వసంత ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతుంది. వసంత హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి పోలీసులు స్పాట్ కు వెళ్లారు. వసంత మృతదేహాన్ని భైంసా అసుపత్రికి తరలించారు. వసంత తల్లిదండ్రులకు కాల్ చేసి విషయం చెప్పారు. భైంసా ఆసుపత్రి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్?లో రూమ్?మేట్స్?ను, ఐఐటీ క్యాంపస్?లో వసంత ఫ్రెండ్స్ ను పోలీసులు ఆమె గురించి ఆరా తీశారు. వసంత ప్రేమలో ఉందనే విషయం మాత్రం పోలీసులు విచారణలో స్పష్టమైంది.

## హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

**అమరావతి:** ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్.

## బడికోసం మాస్టారు కృషి అభినందనీయం

**అమరావతి:** కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం సగరపేటలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పీవీవీ. సత్యనారాయణ మాస్టారు బడి బాగు కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. సొంత నిధులు దాదాపు రూ.10 లక్షలు, దాతల విరాళాలు రూ.1.80 లక్షలతో కార్పొరేట్ స్కూలుని తలదన్నేలా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. క్లాసు రూమ్‌లో టైల్స్, గ్రౌండ్ ఫ్లోరింగ్, పెయింటింగ్, వాల్ రైటింగ్, కాంపౌండ్ వాల్ రంగులతో కొత్తందాలు సంతరించుకునేలా చేశారని కీర్తించారు. నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్ రూం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల సహకారంతో వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్ అన్నారు.

## యూరియా కోసం సిపిఎం ధర్నా

**నల్లగొండ:** రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.

# వెలిగొండ పూర్తి కాకుండానే రజగన్ రిబ్బన్ కట్

**పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం**

**వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా**

**పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి**

**ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా**

**వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు**

**మార్కాపురం:**జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నానని, అలాగే మార్కాపురం, మదనప్లలె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనప్లలెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'

**పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు**

**వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం**

**న్యూఢిల్లీ:** ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశ పెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగ వచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## అన్నాడిఎంకెతో సీట్ల పంపకాలు

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారంనాడు చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలకు బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళని స్వామి, సీనియర్ నేతలు పాల్గోనున్నారు. కాగా, 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు. ఎన్డీయేలోకి తిరిగి రావడానికి బీజేపీనే కారణమని, ఆ పార్టీతోటే తాను సీట్ల సంప్రందింపులు సాగిస్తానని దినకరన్ స్పష్టం చేశారు. సీట్ల పంపకాలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, బీజేపీకి 35 సీట్లు, ఏఎంఎంకే వంటి ఇతరులకు 15 సీట్లను పార్టీ కేంద్ర నాయకత్వం కోరనుందని చెప్పారు. 2024లో పార్టీ పనితీరు ఆధారంగానే 2026 ఎన్నికల్లో సీట్ల పంపకాలు ఉండాలంటూ అన్నాడీఎంకే నాయకత్వానికి తెలియజేశామని, 2021లో ఇచ్చినట్టుగా 20 సీట్లు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని చెప్పారు. ఏఎంఎంకే 8 నుంచి 10 సీట్లలో పోటీ చేయాలనుకుంటోందని, ఏసీ షణ్ముగం 'న్యూ జస్టిస్ పార్టీ', జాన్ పాండియన్ 'తమిళగ మక్కల్ మున్నేట్ర గళం' చెరో రెండు సీట్లు ఆశిస్తున్నాయని, తక్కిన సీట్లు ఇతర పార్టీలకు బీజేపీ కేటాయిస్తుందని చెప్పారు. కాగా, 30 సీట్లకు తాము తగ్గేది లేదని, ఏఎంఎంకే 8 సీట్లయినా కావాలని గట్టిగా చెబుతోందని, దీంతో ఎన్డీయే బ్లాక్‌కు 40-50 సీట్లు కోరనున్నామని బీజేపీకి చెందిన మరో నేత తెలిపారు. కాగా, అన్నాడీఎంకే సొంతంగా 170 సీట్లలో పోటీ చేసేందుకు పట్టుదలగా ఉంది. బీజేపీకి 25, ఎన్డీయే బ్లాక్‌కు మరో 10 సీట్లు కేటాయించగలమని చెబుతోంది.

## వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట

**పులివెందుల:** వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు

# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

**న్యూయార్క్:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు న్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొ న్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్ధమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

# సోనమ్ గోల్డ్ స్కర్ట్ సూట్ స్టన్నింగ్




సోనమ్ గోల్డ్ స్కర్ట్ సూట్ స్టన్నింగ్ అయినా సోషల్ మీడియాల్లో నిరంతరం తనదైన ఫ్యాషన్ సెన్స్ తో హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. సోనమ్ కపూర్ పరిచయం అవసరం లేదు. ధనుష్ సరసన లాంటి జాతీయ అవార్డ్ చిత్రంలో నటించిన సోనమ్ పలు సినిమాల్లో అవార్డ్ విన్నింగ్ ప్రదర్శనలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఇటీవల సోనమ్ సినిమాలను తగ్గించి తన బిజినెస్‌మేన్ హబ్బీతో కలిసి విదేశాల్లో నివసిస్తోంది. అయినా సోషల్ మీడియాల్లో నిరంతరం తనదైన ఫ్యాషన్ సెన్స్ తో హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. తాజాగా సోనమ్ గోల్డ్ కలర్ స్కర్ట్ సూట్‌లో మెరిసిపోయింది. ఈవెంట్లో మెరిసే కోచర్ స్కర్ట్ సూట్‌లో కనిపించగా.. ఇది తమరా రాల్ఫ్ 2024 కలెక్షన్ నుండి ఎంపిక చేసుకున్న డిజైనర్ లుక్. దీనికి గొలుసు అలంకరణ.. మోకాళ్ల వరకు ఉన్న దుస్తులకు గోల్డ్ షేడ్స్‌లో ఉన్నాయి. తన అలంకరణకు తగ్గట్టుగా బంగారు నగలతోను అలంకరించుకుంది. చంకీ చైన్ స్టేట్‌మెంట్ గోల్డ్ నెక్లెస్ పెద్ద స్టడ్ చెవిపోగులతో సోనమ్ ఒద్దికగా కనిపించింది. జాతీయ అవార్డు వచ్చాక గర్వం తలకెక్కింది: సీనియర్ హీరో ఈ లుక్ ని డిజైన్ చేసినది ఇంతకీ ఎవరు? అంటే.. మరెవరో కాదు.. ప్రముఖ నిర్మాత, సోనమ్ సోదరి రియా కపూర్ ఈ లుక్ ని డిజైన్ చేసింది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారింది. సోనమ్ లుక్ కి రియాక్షన్స్ ఒక రేంజులో ఉన్నాయి. ఈ లుక్ అద్భుతంగా ఉందంటూ నటి భూమి పెడ్నేకర్ వ్యాఖ్యానించారు. సోనమ్ భర్త, వ్యాపారవేత్త ఆనంద్ అహూజా %-%వైల్డ్%-% అని రాశారు. సోనమ్ లుక్‌పైనా, రియా పోస్ట్‌పైనా ఒక అభిమాని వ్యాఖ్యానించాడు. ఫ్యాషన్ ఐకాన్.. ఫ్యాషన్ క్వీన్ అని కొందరు వ్యాఖ్యానించారు. స్కర్ట్ సూట్ లాయలిస్ట్‌లుగా మారుతున్న అనేక మంది ప్రముఖుల్లో సోనమ్ ఒకరు .. బ్లేజర్ ం స్కర్ట్స్ కాంబినేషన్ తో సోనమ్ ప్రత్యేకతను ఆపాదిస్తోందని పలువురు ప్రశంసించారు.

# హీరోయిన్ డెడికేషన్ కు హ్యాట్సాఫ్..!



హీరోయిన్ డెడికేషన్ కు హ్యాట్సాఫ్..! ఐతే సినిమాకు తాము పెట్టాల్సిన ఎఫర్ట్స్, పడాల్సిన కష్టం పడ్డాక ఒకవేళ అది వర్క్ అవుట్ కాకపోయినా సరే అందులో నటించిన హీరోలైనా, హీరోయిన్స్ అయినా పెద్దగా ఫీల్ అవ్వరు. కెరీర్ లో సక్సెస్ లేకపోతే కొంతమందికి అవకాశం వచ్చినా ఏదో వచ్చిందిలే చేసేద్దాం లే అన్నట్టుగా ఉంటుంది. ముఖ్యంగా అసలేమాత్రం ఫాం లో లేని భామలు కొన్ని ఛాన్స్ లు వచ్చినా అంతగా ఆసక్తి పెట్టలేరు. కానీ తెలుగు అమ్మాయి రీతు వర్మ వాళ్లకి భిన్నంగా ఛాన్స్ వచ్చింది అంటే చాలు దాని కోసం ప్రాణం పెట్టేస్తుంది. హిట్లు ఫ్లాపులు అనేవి కొన్నిసార్లు లక్ ని బట్టి తగులుతాయి. ఐతే సినిమాకు తాము పెట్టాల్సిన ఎఫర్ట్స్, పడాల్సిన కష్టం పడ్డాక ఒకవేళ అది వర్క్ అవుట్ కాకపోయినా సరే అందులో నటించిన హీరోలైనా, హీరోయిన్స్ అయినా పెద్దగా ఫీల్ అవ్వరు. %రూశ్రీంశీ =ఖుఎ% - జాతీయ అవార్డు వచ్చాక గర్వం తలకెక్కింది: సీనియర్ హీరో అలాంటి కేటగిరిలోకే వస్తుంది రీతు వర్మ. ఇప్పటివరకు చేసిన సినిమాల్లో సక్సెస్ ల కన్నా ఫ్లాపులే ఎక్కువ అయినా కూడా అమ్మడు ఎక్కడ కాన్ఫిడెన్స్ లూజ్ అవ్వట్లేదు. అందుకే వచ్చిన పాత్రకు తన డెడికేషన్ చూపించి పాత్రకు కొత్త వన్నె తెస్తుంది. ప్రస్తుతం రీతు వర్మ శ్రీ విష్ణుతో శ్వాగ్ సినిమాలో నటించింది. సినిమాలో ఆమెది చాలా ఇంపార్టెంట్ రోల్ అని తెలుస్తుంది. మూడు తరాల కథలతో వస్తున్న శ్వాగ్ సినిమాలో రీతు వర్మ కూడా రెండు వేరియేషన్స్ ఉన్న పాత్రలో నటించింది. ఐతే ముఖ్యంగా ఒక పాత్ర కోసం అమ్మడు చాలా వెయిట్ లాస్ అయినట్టు తెలుస్తుంది. శ్వాగ్ సినిమాలో రుక్మిణి దేవి పాత్ర కోసం రీతు వర్మ చాలా బరువు తగ్గారట. సినిమా కోసమే తను చేస్తున్న పాత్ర కోసమే రుక్మిణి వెయిట్ లాస్ అయినట్టు తెలుస్తుంది. సినిమా కోసం ఆమె చూపించే డెడికేషన్ చూసిన కొందరు ఇలాంటి వారికి తప్పకుండా సక్సెస్ రావాలని అంటున్నారు. బాలయ్య వారసుడి డెబ్యూకి 100 కోట్లు! వరుస సక్సెస్ లతో ఫాం లో ఉన్న శ్రీ విష్ణు శ్వాగ్ తో హ్యాట్రిక్ కొడతాడా.. కెరీర్ లో అసలు దూకుడు లేని రీతు వర్మ కెరీర్ లో జోష్ వచ్చేలా చేస్తాడా అన్నది చూడాలి. శ్వాగ్ సినిమాతో రీతు వర్మ తిరిగి ఫాం లోకి రావాలని ఆమె ఫ్యాన్స్ కూడా కోరుతున్నారు. అక్టోబర్ 4న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. హసిత్ గోలి డైరెక్ట్ చేసిన శ్వాగ్ సినిమా రిజల్ట్ మీద చిత్ర యూనిట్ అంతా సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు.

# జ్యోతి రాయ్.. బెడ్‌పై స్టన్నింగ్‌గా!




జ్యోతి రాయ్.. ఈ మధ్య సోషల్ మీడియాలో బాగా వినిపిస్తున్న పేరు. గుప్పెడంత మనసు సీరియల్ తో ఈ కన్నడ బ్యూటీ ఫుల్ పాపులర్ అయింది. ఆ సీరియల్ లోని జగతి పాత్రతో కన్నడ నాట దక్కించుకోలేని క్రేజ్ ను ఇక్కడ సంపాదించుకుంది. సీరియల్ లో చీరకట్టులో అమ్మతోపాటు టీచర్ రోల్ లో ఎంతో పద్ధతిగా కనిపించింది. కానీ సోషల్ మీడియాలో అందాల ప్రదర్శనతో కుర్రకారును నిద్ర పట్టకుండా చేస్తోంది. ప్రస్తుతం సీరియల్ నుంచి బయటకొచ్చిన ఈ బ్యూటీ.. రెండు ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఏ మాస్టర్ పీస్ మూవీతో పాటు ప్రెట్టీ గర్ల్ వెబ్ సిరీస్ లో యాక్ట్ చేస్తోంది. త్వరలోనే ఈ రెండు కూడా రిలీజ్ కానున్నాయి. అయితే ఏ మాస్టర్ పీస్ సినిమా సమయంలో ఆ మూవీ డైరెక్టర్ సుకు పూర్వాజ్ తో ప్రేమలో పడింది. ఆ తర్వాత తన ఇన్ స్టా హ్యాండిల్ పేరును జ్యోతి పూర్వాజ్ గా మార్చేసుకుంది. ఇటీవల సుకు పూర్వాజ్ ను పెళ్లి చేసుకుని కొత్త లైఫ్ మొదలుపెట్టింది. ఈ విషయం ఆమెనే చెప్పింది. ఆ మధ్య సుకు క్రియేట్ చేసిన సింబల్ ను ఎదపై టాటూగా వేయించుకుంది. అందుకు సంబంధించిన వీడియోను కూడా షేర్ చేసింది. దీంతోపాటు వీరిద్దరి రొమాంటిక్ ఫోటోలు సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండ్ అవుతూనే ఉంటాయి. అయితే జ్యోతికి 20 ఏళ్ల వయసులోనే వివాహం జరిగినా కొన్ని కారణాల వల్ల విడాకులు తీసుకుంది. మరోవైపు, సోషల్ మీడియాలో జ్యోతి.. గ్లామర్ కు షో బౌండరీలు లేవు. ఎప్పటికప్పుడు పొట్టి డ్రెస్సులో పోజులు ఇస్తూ హీటెక్కిస్తుంటోంది. కుర్రకారు మతులు పోగుడుతుంటోంది. స్కిన్ షోతో కంప్లీట్ ఫిదా చేస్తుంటోంది. అందానికి పర్యాయ పదం తానేనని ప్రూవ్ చేసుకుంటోంది. ఘాటైన అందాలతో మత్తెక్కిస్తుంటోంది. తన ఎద అందాలతో నెటిజన్లను కవ్విస్తుంటోంది. తాజాగా కొత్త ఫొటో షేర్ చేసింది జ్యోతి రాయ్. బ్లాక్ కలర్ సింగిల్ పీస్ డ్రెస్ లో బెడ్ పై కూర్చుని థైస్ షో చేసింది. హెయిర్ లీవ్ చేసి.. తన చూపులతో అందరినీ క్లీన్ బౌల్డ్ చేస్తోంది. జ్యోతి నయా ఫొటోకు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. రోజురోజుకు జ్యోతి డ్రెస్ సైజ్ తగ్గిపోతుందని కామెంట్లు పెడుతున్నారు. మొత్తానికి ఈ కన్నడ బ్యూటీ భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు దక్కించుకుంటుందో చూడాలి.



# మెహరీన్ మళ్లీ మత్తెక్కించే బ్యూటీతో!

కెరీర్ ఆరంభంలో అమ్మడు బొద్దు అందంతోనే బోలెడంత పాపులారిటీ దక్కించుకుంది. అటుపై కొన్నాళ్లకి సన్నజాజి సోయగంలా మారిపోయి కొత్త అనుభూతిని పంచింది. ఈ రెండు దశల్లోనూ మెహరీన్ తెలివిగా సక్సెస్ అయింది. చబ్బీ లుక్ నుంచి స్లిమ్ లుక్ లోకి మారేసరికి ఇమేజ్ పై ప్రభావం పడుతుందని భావించింది గానీ అలా జరగ లేదు. తాజాగా అమ్మడు ఆ రెండు లుక్ ల్ని బ్యాలెన్స్ చేస్తూ ఓ ఫోటోని మార్కెట్ లోకి వదిలింది. ఇదిగో ఇక్కడున్న ఫోటోని చూస్తే ఆ వ్యత్యాసం ఏంటి? అన్నది స్పష్టంగా అర్ధమవుతుంది. మెహరీన్ ఈ పిక్ లో మరీ చబ్బీ లుక్ లో కాకుండా...టూమచ్ గా సన్నగాను కూకుండా మీడియం లుక్ ని మెయింటెన్ చేసింది. చిట్టిపొట్టి దుస్తుల్లో మెహరీన్ ముస్తాబైన విధానం ఆకర్షిస్తుంది. నుదిటిన ముత్యాల పాపిడి బొట్టు.. జెడని సైత అదే డిజైన్ తో ఎంతో అందంగా మలిచింది. డ్రెస్ ని మ్యాచ్ చేస్తూ చేతికి ధరించిన గాజులు అంతే అందంగా కనిపిస్తున్నాయి. చెవులకు పెట్టిన దిద్దులు ప్రతీది మెహరీన్ ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. మెహరీన్ అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. లుక్స్ ప్రెట్టీ అంటూ పొగిడేస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే సినిమాల జోరు తగ్గిన సంగతి తెలిసిందే. మూడేళ్ల క్రితం వరకూ స్పీడ్ గా సినిమాలు చేసిన అమ్మడు ఇప్పుడంత వేగంగా చేయడం లేదు. ఈ మూడేళ్ల కాలంలో కేవలం ఏడాదికి ఒకటి చోప్పున ఒక సినిమానే చేసింది. అందులో ఎఫ్ -3 తప్ప మిగిలిన రెండు చిత్రాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. స్పార్క్ లైఫ్...మంచి రోజులే సినిమాలు డిజాస్టర్లగా తేలాయి. ప్రస్తుతం తెలుగులో అవకాశాలేవు. తమిళ్ లోనూ ఛాన్సులు కనిపించలేదు. కన్నడలో మాత్రం ఓ సినిమా చేస్తుంది. ఆ ప్రాజెక్ట్ కూడా డిలే అవుతుంది.



# నింగిలోన చందమామ కిందకు దిగొచ్చిందా..?

సవ్యసాచితో తెలుగు తెరకు పరిచయమైన నిధి అగర్వాల్ అంతకుముందే తన సోషల్ మీడియా క్రేజ్ తో సౌత్ లో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. క్రికెటర్ తో డేటింగ్ వార్తలతో అమ్మడి గురించి మరింత మందికి తెలిసింది. అక్కినేని హీరోతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నిధి ఇస్మార్ట్ శంకర్ హిట్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో నిధి అందాలను పూరీ పర్ఫెక్ట్ గా వాడుకున్నాడు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత కెరీర్ దూకుడు చూపిస్తుంది అనుకుంటే అమ్మడు సెలెక్టెడ్ సినిమాలు చేస్తూ వస్తుంది. తెలుగు కన్నా తమిళ పరిశ్రమ మీద ఎక్కువ దృష్టి పెట్టిన నిధి అగర్వాల్ అక్కడ క్రేజీ ఫ్యాన్స్ ని ఏర్పరచుకుంది. నిధి కోసం అక్కడ అభిమాన సంఘాలు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారంటే కోలీవుడ్ లో అమ్మడి క్రేజ్ ఏంటన్నది అర్ధం చేసుకోవచ్చు. గల్లా అశోక్ లీడ్ రోల్ లో చేసిన హీరో సినిమాలో నటించిన నిధి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న హరి హర వీరమల్లు సినిమాలో కూడా నటిస్తుంది. తెలుగులో అవకాశాలు రావట్లేదా లేదా తనే వద్దనుకుందా అన్నది తెలియదు కానీ నిధి ఇన్ స్టా ప్రమోషన్స్ తోనే రెండు చేతులా సంపాదిస్తుందని తెలుస్తుంది. అందుకే సినిమాల కన్నా ఇదే మంచి సోర్స్ అని సోషల్ మీడియా ప్రమోషన్స్ చేస్తూ వస్తుంది. ఇక ప్రొడక్ట్ ప్రమోషన్స్ తో పాటుగా నిధి చేసే గ్లామర్ ఫోటో షూట్ ఫాలోవర్స్ కి మాంచి కిక్ ఇస్తుంది. ప్రతి హీరోయిన్ ఇన్ స్టాగ్రాం లో ఫోటో షూట్స్ చేస్తుంటారు. కానీ కొందరికి మాత్రమే రెగ్యులర్ ఫాలోవర్స్ ఉంటారు. అలాంటి భామల్లో నిధి అగర్వాల్ ఒకరు. లేటెస్ట్ గా అమ్మడు మూన్ లైట్ కలర్ శారీలో అందాలను వెదచల్లుతుంది. కట్టింది శారీనే అయినా ఆమె చేస్తున్న గ్లామర్ ట్రీట్ నెక్స్ట్ లెవెల్ అని చెప్పొచ్చు. ఇక నిధి చేసిన ఈ ఫోటో షూట్స్ కి నింగిలోన చందమామ భూమీదకు వచ్చిందేంటి అంటూ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. తెలుగు తమిళ భాషల్లో క్రేజీ ఫాలోవర్స్ ఉన్న నిధి ఇలా ఫోటో షూట్స్ తోనే కాదు సినిమాలతో కూడా అలరిస్తే ఇంకాస్త బాగుంటుందని అనుకుంటున్న వారు ఉన్నారు. నిధి కొద్దిగా కాన్సెంట్రేట్ చేస్తే చాలు కానీ అమ్మడు టాప్ ప్లేస్ కి వెళ్లే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927,** PHONE NUMBER 9908293393,040- 45046154